


# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ఆ తర్వాత తన సూపర్ మాన్, స్పైడర్ మాన్ బొమ్మలని అక్కకిటువైపులా పెట్టి అమ్మా, నాన్నల నిపిలిచి చూపిస్తూ " చూడండి అమ్మా, నాన్నా! అక్కని ఇద్దరు హీమాన్ లు దగ్గరుండి చూస్తున్నారు, రోహిణీ ఆంటే చెప్పే దేవుళ్ళేకాదు, వీళ్ళు కూడా. ఏం కష్టం రాకుండా చూసుకుంటారు. మీకు తెలుసు కదా వీళ్ళు ఎవరితోనైనా ఎంత బాగా ఫైట్ చేస్తారో". అంటూ కిల కిలా నవ్వాడు.

"అక్కకి జ్వరం తగ్గాలంటే కావలసినది మందు అని నాకు తెలుసు, అయినా కూడా వీళ్ళిద్దరినీ తెచ్చాను అక్కని చూసుకోమని" అన్నాడు.

ముగ్గురూ నవ్వారు వాడి ముద్దు మాటలకి.

"డాక్టర్ మందు ఇస్తారు, నువ్వు నాకింత మంచి ప్రొటెక్షన్ ఇచ్చావు" అని తమ్ముడి నుదిటిన ముద్దు పెట్టుకుంటూ అంది.

పిల్లలిద్దర్నీ అలా చూస్తూ తృప్తిగా నిట్టూర్చారు కిరణ్ రాధికలు.

నిండా పదేళ్ళు లేవు వీడికి. ఎంత ధైర్యం చెప్తున్నాడు! పిల్లలనించి నేర్చుకోవలసినవెన్నో. అనుకున్నారు.

ఎన్నో ఆశలకి, ఇదీ అని చెప్పలేని భయానికీ, ఆత్రుతకీ తెరతీస్తూ శుక్రవారం రానే వచ్చింది.

రోహిణీ, శేఖర్ ఎప్పట్లాగే ఒక్క క్షణం వీళ్ళిద్దర్నీ వదిలి పెట్టకుండా ఉంటున్నారు.

"దేవుడు మనతోనే ఉంటాడు, చల్లగా చూస్తాడు, మన స్వప్నికేమీ కాదు. నరుడి దిష్టికి నల్ల రాళ్ళు పగులుతాయంటారు, మూడువారాలు పూజ చేయిస్తానని వినాయకుడికి ముడుపు కట్టాను, దాంతో అంతా సరి

అయిపోతుంది. ఇది కేవలం దిష్టి తప్ప మరేమీ కాదు. మన స్వప్నికి కావలసిన సహాయం తప్పకుండా దొరుకుతుంది" అంది రోహిణి.

ఇద్దరిలో ప్రాక్టికల్ గా ఉండే శేఖర్ మాత్రం " తప్పకుండా అలా జరుగుతుందని ఆశిద్దాం, జరగాలని కోరుకుందాం. అంతకంటే ఎక్కువగా ఊహించుకోవద్దు. వారి సంగతులు తెలీకుండా మనం అంతకన్నా ఎక్కువగా అనుకోవడం మంచిది కాదు" అంటూ చెప్పాడు

మొదట పరుగుపందెంలో పడిపోవడం దగ్గరనుంచీ, పాపకి ఉన్న కండిషన్ తెలిసేవరకూ జరిగిన సంఘటనలన్నీ పదే పదే సినిమా రీళ్ళలాగ తిరుగుతూనే ఉన్నాయి ఆ నలుగురి మనసుల్లో.

కన్నవారిగా కిరణ్ రాధికలకెంత ఆత్రుత ఉందో, రోహిణీ శేఖర్ లకి కూడా అలాగే ఉంది. పాపతో వారికున్న అపరిమితమైన అనుబంధమే దానికి కారణం.

ప్రతీ విషయమూ, పైకి చెప్పకపోయినా వారి మనసుల్లోనూ నిన్ననే జరిగినట్టే తాజాగా ఉన్నాయి.

పూజ కుంకుమని స్వప్నిక నుదిటిన పెడుతున్న రోహిణిని ప్రేమతో చూస్తూ

" వీళ్ళిద్దరూ లేకపోత ఏమైపోదుమో కదా! ఏనాటి బంధమో ఇది! ఫామిలీలా మారిపోయిన ఫ్రెండ్స్ అంటే వీళ్ళలాంటివారే. ఒకటా, రెండా? ఎన్ని పనుల్లో తమ వెన్నంటి ఉంటారో!" అనుకుంది రాధిక మరోసారి.

శుక్రవారం డాక్టర్లతోటి కిరణ్, రాధిక ఇద్దరే వెళ్ళాలని ముందే నిర్ణయించుకున్నారు.

అయినా అది రోహిణికి, రాధిక కీ కూడా నచ్చలేదు.

" నా మాట విను రోహిణీ! గుంపుగా వెళ్తే వారింటిమీదకి దండయాత్రచేసినట్టుగా ఉంటుంది. మనం వెళ్ళేది పాపకి సహాయం అర్థించడానికి. దానికి పాప తల్లితండ్రులుగా వీళ్ళిద్దరూ, కేసు తెలిసిన వారిగా డాక్టర్ ఒక్కరు లేదా ఇద్దరూ ఉంటే చాలు కదా.

మనం పిల్లల్ని సినిమాకో, రెస్టారెంట్ కో తీసుకువెళదాం. వాళ్ళకీ బావుంటుంది. రాధీ! నువ్వు కూడా వినాలి నా మాట" అంటూ శేఖర్ చాలా సార్లు చెప్పాకా ఆడవాళ్ళిద్దరూ మరో దారి లేక సరే నన్నారు.

"డాక్టరిద్దరూ వస్తానన్నారు "అన్నాడు కిరణ్.

" అవునా, వెరీ గుడ్. వాళ్ళిద్దరూ ఉంటే మనకు ధైర్యం. పాప కేస్ గురించి పూర్తిగా చెప్పడానికి, అవతలవారికున్న ప్రశ్నలకి సమాధానాలు చెప్పడానికి అనుకూలంగా ఉంటుంది. మేమిద్దరమూ పిల్లలతో పాటు దగ్గరలోనే ఉంటాం, ఏది కావలసి వచ్చినా వెంటనే ఫోన్ చెయ్యి. అనవసరంగా కంగారు పడకండి. తప్పకుండా మనకి మంచే జరుగుతుంది. కాకపోతే ఏం చెయ్యాలో అని ఆలోచన చెయ్యాలి, నా మనసులో ఉన్న ఆలోచనలు అప్పుడు చెప్తాను" అన్నాడు శేఖర్ స్నేహితుడి భుజం మీద చెయ్యి వేసి ధైర్యం చెప్తూ.

కిరణ్ నెమ్మదిగా తలఊపాడు.

" అంతేనా! మనం వెళ్ళడం లేదా. సరే అయితే!

రాధీ నువ్వు జాగ్రత్త, ఊరికే కంగారుపడి అన్నయ్యని కంగారు పెట్టకు. దేవుడు చల్లగా చూస్తాడు," అంటూ రాధిక నుదుటన కూడా దేవుడి కుంకుమ పెట్టింది. ఆపైన ఆమెని గాఢంగా హత్తుకుంది.

స్నేహితురాలి స్పర్శకి ఉబికివస్తున్న కన్నీటిని ఆపుకోవడానికి విశ్వప్రయత్నం చేసిన రాధిక రోహిణి భుజం మీద తల వాల్చి ఉండిపోయింది కొన్ని క్షణాలు.

"డాక్టర్ రాజేష్ కార్లో వెళదామన్నారు. మరో పదినిమిషాల్లో వస్తారుట. మీరు రెడీగానే ఉన్నారు కదా?" అంటూ మెసేజ్ చేశారు అన్నాడు కిరణ్ ఫోన్ లో వచ్చిన మెసేజ్ చూస్తూ.

మరో పావుగంట తర్వాత కిరణ్, రాధిక దంపతులు డాక్టరిద్దరి వెనక సీట్లలో కూర్చుని బయలుదేరారు.

కారులో ఉన్న నలుగురూ కూడా ఎవరి ఆలోచనల్లో వారు ఉండడం మూలాన నిశ్శబ్దంగా ఉంది. ఏసీ చేస్తున్న సన్నని చప్పుడు తప్ప మరేమీ వినబడడం లేదు.

అందరి మనసుల్లోనూ ఆత్రుత ఉంది. పాప తల్లితండ్రులుగా రాధిక, కిరణ్ లకి మరింత ఎక్కువగా.

అప్పుడప్పుడు రాజేష్ మాత్రం ఏవో పొడి మాటలు చెప్తూ సంభాషణ ని సాగించే ప్రయత్నం చేస్తున్నాడు.

పదినిమిషాల ప్రయాణం తర్వాత రాధిక అంది "డాక్టర్, వారు మన స్వప్నిక కేస్ ని పరిశీలిస్తారా? మనకి కావలసిన సహాయం చేస్తారా? ఏమంటారు మీరు?" అంది రాధిక ఇంక ఆపుకోలేక.

" ఇప్పటినించే మనం ఏమీ అనుకోవద్దు రాధీ, మన శేఖర్ చెప్పినట్టు ఏం జరుగుతుందో వేచి చూద్దాం" అన్నాడు కిరణ్.

" అవును, ప్రస్తుతం ఆశించడమే మనం చెయ్యగలిగేది" డాక్టర్ రాజేష్ కూడా నెమ్మదైన స్వరంతో అన్నాడు.

" మనలాంటివారెందరో వారిని కలుస్తూ ఉంటారు. అందరివి ఇంచుమించు మనలాంటి పరిస్థితులే అయి ఉంటాయి కూడా. అలాంటప్పుడు ఎలా నిర్ణయిస్తారు? మనకే ప్రత్యేకంగా ఇవ్వడానికి తగ్గ కారణం కూడా వారికి కనిపించాలి కదా? డాక్టర్ చెప్పినట్టు ఆశిద్దాం, ఇది కాక ఇతర ప్రయత్నాలు కూడా చేసుకోవాలి మనం" అన్నాడు కిరణ్ మళ్ళీ.

అతని ఆలోచనా విధానానికి ప్రశంసాపూర్వకంగా చూశాడు డాక్టర్ సుజిత్ అతనివైపు.

మరో ఇరవై నిమిషాల ప్రయాణం తర్వాత అధునాతనంగా ఉన్న ఒక భవంతి ముందు కార్ ఆపాడు రాజేష్.

చాలా సింపుల్ గా ఉన్నా, విలక్షణంగా ఉంది ఆ ఇల్లు.

చిన్న గేట్ ఎదురుగా ఉన్న పొడవైన కాలిబాట కి దారి తీస్తే, పెద్దగేట్లు గరాజ్ లోకి వెళ్తున్నాయి. కార్ బయట ఆపి దిగిన నలుగురూ, వాచ్ మాన్ తో చెప్పి, చిన్న గేట్ తీసుకుని లోపలకడుగు పెట్టారు.

చక్కగా వేసిన బాట, పైన పరిచిన రాళ్ళు. రెండువైపులా రకరకాల పూల మొక్కలు. అవి కాదు డాక్టర్ సుజిత్ చూసినది. బాటకిరువైపులా ఉన్న రక రకాల రంగుల్లో ఉన్న బిళ్ళగన్నేరు మొక్కలు.

కెతరాంతస్ రోసియస్ అనే శాస్త్రీయ నామంతో పిలవబడే ఈ మొక్క కేన్సర్ ని తగ్గించే/కేన్సర్ పై ప్రభావం చూపించే చాలా రకాల పదార్థాలని ఉత్పత్తి చేస్తుంది. దానిపై చాలా రిసెర్చ్ నడుస్తోంది.

'ఎన్నో రకాల పూల మొక్కలుండగా దాన్నే బాటకిరువైపులా వెయ్యడం కేవలం కాకతాళీయమేనా? 'అనుకున్నాడు ఆ కేన్సర్ స్పెషలిస్ట్.

సన్నటి ఆ బాట విశాలమైన వరండాలోకి దారితీసింది.

వరండా మార్బుల్ పరచడం వల్లన చల్లగా ఉంది. కేన్ సోఫా సెట్లు రెండు గుండ్రంగా వేసి ఉన్నాయి. మధ్యలో గ్లాస్ టాప్ ఉన్న సెంటర్ టేబుల్, దానిమీద వరసగా పెట్టి ఉన్న ఇంగ్లీష్ దినపత్రికలు. మధ్యలో తాజా పూలతో ఉన్న ఫ్లవర్ వాజ్. మెత్తటి వాసన వెదజల్లుతున్న ఆపూలనీ, ప్రశాంతంగా ఉన్న ఆపరిసరాలని చూస్తే కాస్త స్వాంతన కల్గింది రాధికకి.

వరండానించి ఇంట్లోకి దారి, ముఖ ద్వారం, తెరిచి ఉన్న ఆ ద్వారం లోంచి చూస్తే విశాలమైన హాలు లోని కొంత భాగం, పై అంతస్థు కి వెళ్ళడానికి ఉన్న మెట్లూ కనిపిస్తున్నాయి.

" కూర్చోండి, సార్ వస్తారు" అంటూ చెప్పిందొక అమ్మాయి నలుగురికీ ట్రేలో మంచినీళ్ళు తెచ్చి ఇస్తూ.

ఆమె ఇచ్చిన నీరు తాగి సోఫాల్లో కూర్చుని వచ్చే వారికోసం ఎదురుచూడసాగారు నలుగురూ.

మరికొన్ని క్షణాల తర్వాత వచ్చారు ముగ్గురు వ్యక్తులు.

ముగ్గురిలోనూ పెద్దవారిని ఆ ఇంటి యజమానిగా గుర్తించారు వాళ్ళు. సుమారు ఐదడుగుల ఎనిమిది అంగుళాలుంటారు ఆయన. తెల్లగా మధ్యస్థంగా ఉన్నారు, అరవై ఐదు వరకూ ఉండచ్చు ఆయన వయసు. తన నలుపు తెలుపుల మిశ్రమంగా ఉన్న జుట్టుని పక్క పాపిడి తీసుకుని నున్నగా దువ్వుకున్నారు. మెత్తటి తెల్లటి కుర్తా, పైజమా వేసుకున్నారు.

ఆయన వేషధారణా, రూపు రేఖలు కూడా చటుక్కున హిందీ కవి గుల్జార్ ని గుర్తు తెచ్చేవిధంగా ఉన్నాయి. అదే మాట అనుకుంది రాధిక. ఆమెకి గుల్జార్ పాటలంటే ప్రత్యేకమైన ఇష్టం.

'ఈయన అచ్చంగా గుల్జార్ గారిలా భలే ఉన్నారు!' అనుకుంది వెంటనే.

ఆయన ముఖం చిరునవ్వుతో ఎంతో ప్రశాంతంగా ఉన్నా, ఎందుకో కళ్ళల్లో కొంత నిస్తేజం కనిపించింది ఆమెకి.

అది కేవలం తన ఊహ కావచ్చు అనుకుందామె.

ఆయన పక్కనున్న అబ్బాయి చాలా హేండ్సం గా బావున్నాడు. పొడుగ్గా, ధృడంగా ఉన్నాడు. అతని ముఖంలో ఏదో తెలియని ఆత్మ విశ్వాసం కనిపించిందామెకి.

అన్నింటికంటే ముఖ్యంగా సూటిగా ఉన్న అతని ముక్కు ప్రత్యేకంగా కనిపిస్తోంది. లేత నీలం రంగు షర్ట్, డార్క్ కలర్ పేంట్ వేసుకుని, మోచేతిపై కోట్ వేసుకున్నాడు. మరో చేత్తో లేప్ టాప్ బాగ్.

చక్కగా ట్రిం చేసిన ఫ్రెంచ్ గడ్డం, ఖరీదైన రింలెస్స్ కళ్ళద్దాలు, జెల్ రాసి నున్నగా పెద్దాయనలాగే పక్కకి దువ్వుకున్న జుట్టూ.

'భలే హుందాగా, అందంగా ఉన్నారిద్దరూ!' అనుకుంది రాధిక.

ఆమెకే కాదు, చూసినవారందరికీ అనిపించేదే అది.

తెల్లటి టాప్, జీన్స్ ధరించిన ఆ మూడో వ్యక్తి వయసు పాతికపైన ఉండచ్చు. ఆమె చెవులకి పెట్టుకున్న సాలిటైర్ దుద్దులు, మెళ్ళో మాచింగ్ లాకెట్ తో ఉన్న తెల్లటి ప్లాటినం గొలుసు ఎంతో అందంగా ఉన్నాయి.

ఆమె కళ్ళు కూడా పెద్దాయన కళ్ళలాగే దయగా, అందంగా ఉన్నాయి. అలాగే ఒకింత దిగులుగా కూడా.

నడుము వరకూ ఉన్న తన మెత్తటి జుట్టుని ఆమె వదులుకున్న తీరు రాధిక కెంతో నచ్చింది.చిన్న ముక్కూ, చెక్కినట్టున్న ఆమె ఆకృతి చాలా చక్కటి అమ్మాయి అనిపిస్తోంది.

వారిని చూడగానే ఇదీ అని చెప్పలేని ఒక చిన్న ధైర్యం, సాంత్వనా కలిగాయి రాధిక కి.

అది కేవలం తన ఊహా? నిజమా? అని ఆలోచించలేదామె. చిన్న నిశ్చింత, తమ పని జరుగుతుందన్న నమ్మకం ఆమెకి నెమ్మదిని చేర్చాయి. తెలియని ఆరాధనా భావంతో ఆమె వారివైపు చూడసాగింది.

బయటకు అడుగు పెట్టిన వారిని చూస్తూనే అప్రయత్నంగానే లేచి నిలబడ్డారు కిరణ్ రాధికలు.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments